## క్లుప్తంగా

### సన్మానం



సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో హుజూరాబాద్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నూతనంగా నియామకమైన మహమ్మద్ సజ్జద్‌ను నాయకులు సోమవారం శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ కోసం కృషి చేసిన సజ్జద్‌కు సముచిత స్థానం దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రాసపల్లి రమేశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, దొగ్గల భాస్కర్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు వాసాల సుధీర్, వేణు, సురేశ్, సల్లు బాబా, శివ, శశి తదితరులు పాల్గొన్నారు.

### కార్యదర్శిని దూషించిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిని దూషించిన వ్యక్తిపై సోమవారం కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాచాపూర్ గ్రామ శివారులో అనుమతి లేకుండా క్రషర్ నిర్మాణ పనులు జరుగుతుండగా కార్యదర్శి పనులను నిలిపివేశారు. క్రషర్ అనుమతి కోసం గ్రామ పంచాయతీలో యజమాని దరఖాస్తు చేయగా ఎన్నికల కోడ్ ఉందని జాప్యం చేశారు. అనుమతి ఇవ్వలేదని ఈ నెల1న సమ్మయ్య అనే వ్యక్తి దూషించగా కేశవపట్నం పోలీసులకు కార్యదర్శి గంగాజమున ఫిర్యాదు చేశారు.

### జేఎల్‌ఎంకు గాయాలు


వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న రత్నం ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం పైనుంచి పడటంతో గాయాలయ్యాయి. గ్రామంలో విద్యుత్ లైన్లు మరమ్మతు చేస్తుండగా స్తంభం పైనుంచి జారీ పడ్డాడు. తీవ్ర గాయాలు కాగా విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చిన్న విద్యుత్ సమస్య ఉన్నా తక్షణం పరిష్కరించే రత్నంకు ప్రమాదం జరగడం పట్ల గ్రామస్తులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

### పిడుగుపాటుతో ఆవు మృతి



రామడుగు: మండలంలోని షానగర్ గ్రామం కొత్త భూమయ్యకు చెందిన పాడి ఆవు పిడుగుపాటుతో మృతి చెందింది. ఆదివారం సాయంత్రం పొలం వద్ద ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. రాత్రి పిడుగు పడటంతో ఆవు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.


### సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు



అధికారికి దరఖాస్తు అందజేస్తున్న స్వామిరెడ్డి

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లావాదేవీల సమగ్ర సమాచారం కావాలంటూ జీకేఆర్ ఎంఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి స్వామిరెడ్డి సోమవారం జిల్లా సహకార అధికారికి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు పత్రం అందజేశారు. 2016 నుంచి 2024 వరకు సంఘంలో జరిగిన లావాదేవీలు, ట్రయల్ బ్యాలెన్స్ సీట్, ఇతర అంశాలు, సంఘానికి రావాల్సిన, ఇవ్వాల్సిన అనుమతుల లిస్టు, ఎనిమిదేళ్ల ఖర్చుల వివరాలు ఇవ్వాలని దరఖాస్తు పత్రంలో కోరారు.

### శ్రీ శారదాపీఠాధిపతిని కలిసిన కాశెట్టి కుమార్



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని బొత్తలపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త, బీజేపీ నాయకుడు కాశెట్టి కుమార్ విశాఖలోని శారదా పీఠాధిపతి శ్రీనందేంద్ర సరస్వతి స్వామివారిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం రాజా శ్యామలదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

# సక్రమంగా రావు.. సమస్యలు తీరవు

- వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందుల్లో గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది
- అరకొర వేతనాలతో అప్పులపాలవుతున్న వైనం
- గ్రామాల పరిశుభ్రతకు నిత్యం స్వచ్ఛ పనుల్లో నిమగ్నం
- పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్



ఇందుర్తిలో చెత్త, మట్టిని ట్రాక్టర్‌లో పోస్తున్న పారిశుధ్య కార్మికులు

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి నెలనెలా వేతనాలు సక్రమంగా అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వచ్చే కొద్దిపాటి వేతనం సమయానికి రాక కుటుంబ పోషణకోసం అప్పులచేస్తూ చిక్కుల్లో పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరిస్తుందని ఎదురుచూస్తున్నారు. రోజూ తొమ్మిది గంటలు పనిచేస్తు పనికి తగిన వేతనం రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 16 మంది కారోబార్లు, 110 మంది పారిశుధ్య( పంపుడ్రైవర్లు, ఎలక్ట్రీషియన్లు, సపాయి) కార్మికులు పనిచేస్తున్నారు. ప్రతినెల రూ.9,500 వేతనం అందుతోంది. ఉదయం ఏడు గంటలకే పనిలో ఉండాలనే నిబంధన ఉంది. పంచాయతీ కార్యదర్శి పనిని పరిశీలించి ఫొటో తీసి డీపీవోకు పంపించాల్సి ఉంటుంది. ఏడు నుంచి పన్నెండు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు గ్రామాల్లోని ఏదో ఒక వార్డులో పని చేయాలి. చిన్న నుంచి పెద్ద గ్రామం వరకు కాలనీల్లో చెత్తాచెదారం తొలగించడం, మురుగు కాలువలు శుభ్రం చేస్తుంటారు. అనారోగ్యానికి గురవుతున్న వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక వచ్చే జీతం సరిపోక అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ కూలీలకు రోజు రూ.400 నుంచి రూ.500 ఇస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు సగటున రోజుకు కేవలం రూ.316 మాత్రమే వర్తిస్తోందని వాపోతున్నారు. కారోబార్లు ఇంటి పన్నులు, నల్లాబిల్లులు వసూలు చేస్తూ గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నారు. అంతేకాకుండా పంచాయతీ కార్యదర్శులు చేసే పనులు కూడా చేస్తున్నారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోని విద్యుత్ హెల్పర్లు కుటుంబ అవసరాలు తీరడంలేదని వాపోతున్నారు. పారిశుధ్య సిబ్బంది డిమాండ్ల పరిష్కారం గత బీఆర్‌ఎస్ పాలనలో వివిధ దశల్లో ఆందోళనలు చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపుమేరకు మండలస్థాయిలో నిరాహార దీక్షలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా పనికి తగిన వేతం ఇవ్వాలని కోరుతున్నారు. కారోబార్లకు అసిస్టెంట్ కార్యదర్శిగా పదోన్నతులు కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



మురుగు కాల్వ శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

### అప్పులు చేస్తున్నా



గత ఆరు నెలలుగా జీతం రావడంలేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. అప్పులు చేసి కాలం వెల్లదీస్తున్నాం. కారోబార్లను మల్టీపర్పస్ విధానం నుంచి మినహాయించాలి. ప్రభుత్వం తగిన న్యాయం చేయాలి.

– ఎస్. తిరుపతి, కారోబార్, సీతారాంపూర్

### ఇబ్బందులు పడుతున్నా



నెలనెలా జీతం రాక ఇబ్బందులు పడుతున్నా. నా భర్త పారిశుధ్య కార్మికుడిగా పని చేసి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పులు పెరిగిపోతున్నాయి. కనీసం రూ.22,000 వేతనం ఇస్తే బాగుంటుంది.

– బి.శారద, పారిశుధ్య కార్మికురాలు, కొండాపూర్

### జీపీలే జీతాలు చెల్లించాలి



గ్రామ పంచాయతీలే జీతాలు చెల్లించాలి. మండల పరిషత్, డీపీవోకు సంబంధం ఉండదు. ఏడాదిలో ఆదాయం, ఖర్చు చూసుకోవాల్సిన బాధ్యత జీపీలదే. అరకొర వేతనాల విషయం మా పరిధిలో లేదు.

– మధుసూదన్, ఎంపీడీఓ, చిగురుమామిడి

# విత్తన దుకాణాల్లో తనిఖీ



రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఏవో యాస్మిన్

రామడుగు: మండలంలోని షానగర్, రామడుగు, గోపాల్‌రావుపేట గ్రామాల్లోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి యాస్మిన్ సోమవారం తనిఖీ చేశారు. విత్తన డీలర్ల స్టాక్ రిజిస్టర్లు, ప్రిన్సిపుల్ సర్టిఫికెట్స్, బిల్ బుక్స్‌ను పరిశీలించారు. మండలంలో దాదాపు 5,800 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయనున్నారని, వీటికి సరిపడా పలు రకాల కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు పత్తి విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా రశీదు తీసుకోవాలని, షాపు యాజమానులు అన్ని రకాలుగా వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

### ఎక్స్‌పైరీ మందుల వివరాలు నమోదు చేయాలి

జమ్మికుంట: గడువు ముగిసే మందులను రిజిస్టర్‌లో నమోదు చేస్తూ పర్యవేక్షణ చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫార్మసీ ఆఫీసర్ బుస్సా శివకుమార్ సూచించారు. సోమవారం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ఫార్మసీ స్టోర్, మందుల పంపిణీ గదిలోని రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ– ఔషధి ద్వారా రోజు వారి మందులను అకౌంట్ చేయాలని, ఆసుపత్రిలో ఫార్మసిస్టు పోస్టు భర్తీ, మందుల సురక్షితకు నిలువ చేసే గదిలో ఎయిర్ కండిషన్ ఏర్పాటు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ సిబ్బంది ఉన్నారు.



రికార్డును పరిశీలిస్తున్న శివకుమార్

### గుండెపోటుతో బీజేపీ నాయకుడు మృతి

జమ్మికుంట: పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ సీనియర్ నాయకుడు గుండా తిరుపతయ్య (75) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. ఇంటిలో ఒక్కసారిగా కుప్పకులగా చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం, బీజేపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని, ఆయన మృతి పట్ల ప్రముఖులు సంతాపం తెలిపారు.

# పనులు సకాలంలో పూర్తి చేయాలి



పాఠశాలలోని వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

చొప్పదండి: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు కోరారు. మండలంలోని కొలిమికుంట, ఎన్‌టీఆర్‌కాలనీ, కుర్మపల్లి, కాట్నపల్లి, గ్రామాల్లో పనులను సోమవారం పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయించాలని ఎంఈవో వేణుగోపాల్‌ను ఆదేశించారు. కార్యక్రమాల్లో రఘు కిషోర్, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు ఆడుకునే నోటుతో బురిడీ

రామడుగు(చొప్పదండి): దుకాణాల్లో లభించే, పిల్లలు ఆడుకునే రూ.200 నోటుతో ఓ వృద్ధురాలిని బురిడీ కొట్టించాడు గుర్తు తెలియని వ్యక్తి. వివరాల్లోకి వెళ్తే.. రామడుగు మండలంలోని షానగర్‌కు చెందిన చిరుత లక్ష్మి మండల కేంద్రంలోని మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తుంటుంది. సోమవారం కూడా వెళ్లింది. ఆమె వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి, రూ.50ల కూరగాయలు కొనుగోలు చేశారు. అనంతరం ఆమెకు రూ.200 నోటు ఇచ్చాడు. పిల్లలు ఆడుకునే నోటుగా గుర్తించని లక్ష్మి దాన్ని తీసుకొని, రూ.150 ఇచ్చింది. ఇంటికి వెళ్లాక గుర్తించినట్లు ఆమె కుమారుడు రాజమౌళి తెలిపాడు. కాగా, కష్టపడి కూరగాయలు పండించి, అమ్ముకుందామంటే కేటుగాళ్లు ఇలా మోసం చేస్తున్నారని బాధితురాలు వాపోయింది. ఇలాంటి వాళ్లను కఠినంగా శిక్షించాలని పలువురు రైతులు కోరుతున్నారు.



రూ.200 నోటు చూపుతున్న రాజమౌళి

# విజ్ఞానాన్ని పెంచుకోవాలి

విద్యానగర్(కరీంనగర్): విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని నగర డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి హరిశంకర్ అన్నారు. కరీంనగర్‌లోని బ్లూమెన్ డ్యాన్స్ అకాడమీలో నెల రోజులుగా జరుగుతున్న డ్యాన్స్ శిక్షణ ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన సీనియర్స్‌కు సోమవారం నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. సమయాన్ని ఎప్పటికీ వృథాచేయొద్దన్నారు. తమలోని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర్ అధ్యక్షుడు చల్లా హరిశంకర్, గాయకులు చిలువేరు శ్రీకాంత్, సిద్ది రమేశ్, కొరియోగ్రాఫర్ గజ్జెల ధర్మేందర్, ట్రాన్స్‌కో ఏఈ సంపత్‌కుమార్, డ్యాన్స్ మాస్టర్, డ్యాన్స్ అకాడమీ చైర్మన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ స్వరూపరాణి

### గంజాయి పట్టివేత

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలోని ఎల్లమ్మ గుడి వద్ద గంజాయి పట్టుకున్నట్లు కొత్తపల్లి ఎస్సై తెలిపారు. ఎలగందుల ఎల్లమ్మ గుడి వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆసిఫ్‌నగర్‌కు చెందిన రంగుల సురేశ్ వద్ద 5.224 కిలోల గంజాయి పట్టుకున్నామన్నారు. ఒడిశాలోని మోటో గ్రామం నుంచి ఫయాజ్ వద్ద వారం రోజుల క్రితం కొనుగోలు చేసి ఆసిఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని గ్రానైట్ క్వారీల్లో పనిచేస్తున్న కార్మికులకు అధిక ధరకు విక్రయించేందుకు తీసుకొస్తున్నారని తెలిపారు. నిందితుడు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఆంధ్రా, ఒరిస్సాకు గ్రానైట్ లారీ నడుపుతుండటం వల్ల పరిచయాలు పెరిగి గంజాయి విక్రయించి అధిక లాభం పొందాలన్న ఉద్దేశంతో తీసుకొస్తున్నాడని అన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పట్టుకున్న గంజాయిని తూకం వేస్తున్న పోలీసులు

# రద్దీ రహదారిపై తరచూ ప్రమాదాలు

శంకరపట్నం: మండలంలోని జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బైపాస్ రోడ్డుతోపాటు జాతీయ రహదారి నిర్మాణం పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై వందలాది వాహనలు ప్రయాణిస్తుంటాయి. మొలంగూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయి. పనులు జరిగే ప్రాంతాల్లో సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



తాడికల్‌లో బోల్తాపడిన డీజిల్ ట్యాంకర్‌ను క్రేన్ సహాయంతో తొలగిస్తున్న ఏసీపీ(ఫైల్)

**నాలుగు నెలల్లో జరిగిన ప్రమాదాలు**

- ఫిబ్రవరి 7న కొత్తగట్టు శివారులో తెల్లవారుజామున రోడ్డుపై పార్కింగ్ చేసిన డీబీఎల్ కంపెనీకి చెందిన మట్టి టిప్పర్ పార్కింగ్ చేయడంతో కరీంనగర్‌కు చెందిన ప్రభాకర్ కారులో వరంగల్ వెళ్తూ టిప్పర్‌ను ఢీ కొనడంతో తనతోపాటు మరో వ్యక్తి మృతిచెందగా కారు డ్రైవర్, మరొకరు గాయాలతో బయటపడ్డారు.
- ఫిబ్రవరి 24న గొల్లపల్లి శివారులో మోటార్ సైకిళ్లు ఢీకొని కొత్తగట్టుకు చెందిన సాంబశివారెడ్డి మృతిచెందాడు.
- మార్చి11న కరీంనగర్ నుంచి హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ కారులో వస్తుండగా కొత్తగట్టులో పొలాల్లోకి దూసుకెళ్లింది.
- ఏప్రిల్ 4న కేశవపట్నం బస్టాండ్ ఎదుట ఆర్టీసీ బస్సు ఢీకొని చింతగట్టుకు చెందిన ఆంజనేయులు అనే యువకుడు ప్రాణాలు వదిలాడు.
- ఏప్రిల్ 7న తెల్లవారుజామున ద్విచక్రవాహనం ఢీ కొని కొత్తగట్టుకు చెందిన ఐలయ్య అనే వ్యక్తి మరణించాడు.
- ఏప్రిల్ 15న కేశవపట్నం శివారులో ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో చెట్టుకు కారు ఢీకొని కరీంనగర్‌కు చెందిన సుదర్శన్ ప్రాణాలు కోల్పోయాడు.
- మే 15న తాడికల్‌లో డీబీఎల్ కంపెనీకి చెందిన డీజిల్ ట్యాంకర్ బోల్తాపడటంతో పూదరి శ్రీనివాస్ మరణించగా, ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి.
- మే 20న తాడికల్‌లో టిప్పర్ ఢీ కొని మానకొండూర్‌కు చెందిన పర్వతం ఎల్లయ్య మరణించగా పరిహారం ఇవ్వాలని రోడ్డుపై బంధువులు ఆందోళన చేశారు.
- మే 15న ప్రమాదంలో గాయపడిన కనుకమ్మ చికిత్స పొందుతూ 26న ప్రాణాలు వదిలింది.

**స్పీడ్ లిమిట్ పాటించాలి**

ప్రమాదాల నివారణకు వివిధ వాహనాల డ్రైవర్లు స్పీడ్ లిమిట్ పాటించాలి. జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో రాత్రివేళ జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి.

– లక్ష్మారెడ్డి, ఎస్సై

- ఇటీవల కరీంగర్ ప్లానింగ్ కార్యాలయంలో పనిచేస్తున్న కిరణ్ స్వగ్రామం వీణవంక మండలం కనపర్తి వెళ్తుండగా కేశవపట్నం శివారులో స్పీడ్‌బ్రేకర్ వద్ద ముందున్న టిప్పర్‌ను కారు ఢీకొన్న సంఘటన జరిగింది. ఈప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులు క్షేమంగా బయటపడ్డారు.

# హెచ్‌టీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏవో సత్యం

కరీంనగర్‌రూరల్: నిషేధిత హెచ్‌టీ పత్తి విత్తనాలను డీలర్లు విక్రయించిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడుతాయని మండల వ్యవసాయాధికారి బి. సత్యం అన్నారు. సోమవారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లోని రైతువేదికలో జరిగిన సీడ్స్, ఫర్టిలైజర్స్ డీలర్ల మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన దృష్ట్యా విత్తనాలు, ఎరువులను సరిపడా స్టాక్ పెట్టుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని, రశీదుపై తప్పనిసరిగా రైతు సంతకాలు తీసుకోవాలని సూచించారు. సేల్స్ రిజిస్టర్‌లో విక్రయాల వివరాలను రాసి ప్రతిరోజూ సాయంత్రం 4గంటల్లోపు రిపోర్టు పంపాలని తెలిపారు. పత్తి విత్తనాల ప్యాకెట్‌ను రూ.864 చొప్పున మాత్రమే విక్రయించాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన డీలర్లు పాల్గొన్నారు.

### నలుగురిపై కేసు

కరీంనగర్‌క్రైం: తప్పుడు పత్రాలు సృష్టించి ఒకే భూమిని పలువురికి అమ్మి కొనుగోలుదారును మోసం చేసిన ఘటనలో నలుగురిపై కరీంనగర్‌రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కాగా, అందులో ఒకరిని రిమాండ్‌కు తరలించారు. సీఐ ప్రదీప్‌కుమార్ వివరాలు.. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం గొడిశెలపేటకు చెందిన గంగిరెడ్డి భీంరెడ్డి మహారాష్ట్రలోని పూణెలో నివాసం ఉంటున్నాడు. కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని భూమిని కొనుగోలు చేశాడు. భీంరెడ్డి ఏళ్ల తరబడి పూణెలో ఉండడం గ్రహించి అతడి స్నేహితులు లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, సునీల్‌స్థలాన్ని కాజేయాలనే ఉద్దేశంతో కిరణ్‌రెడ్డి తన భార్య సుకన్య పేరు మీద డబుల్ రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈక్రమంలో భీంరెడ్డి సదరు స్థలం వద్దకు వెళ్లగా చంపుతానని బెదిరించడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాధవరావు, కిరణ్‌రెడ్డి, సుకన్య, సు నీల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సోమవారం లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

### రోగులకు పండ్లు పంపిణీ

కరీంనగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సోమవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్,నాయకులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్